## సందేహాలుంటే.. ఫోన్ చేయండి

■ జిల్లా ఎన్నికల అబ్జర్వర్, అదనపు డీజీపీ దయాల్ గంగ్వార్



పోలింగ్ కేంద్రాల్లో వసతులపై ఆరా తీస్తున్న అదనపు డీజీపీ దయాల్

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 15 : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎలాంటి అవకతవకలు జరగడానికి వీలు లేదని జిల్లా ఎన్నికల పోలీస్ అబ్జర్వర్, అదనపు డీజీపీ దయాల్ గంగ్వార్ స్పష్టం చేశారు. జిల్లాలోని వివిధ పోలింగ్ కేంద్రాల ప్రాంతాలను సందర్శించారు. బుధవారం చౌటకూర్, ఝరాసంఘం, కుప్పానగర్, ఇస్మాయిల్‌ఖాన్‌పేట్, చిద్రుప్ప, బొంతపల్లి పోలింగ్ లొకేషన్స్, బార్డర్ చెక్‌పోస్టుల పనితీరు, పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల పారదర్శకతపై ఎలాంటి సందేహాలు ఉన్నా ఎవరైనా నేరుగా 8712656716 నంబర్‌కు ఫోన్ ద్వారా సంప్రదించాలన్నారు. సిబ్బంది విధినిర్వహణలో ఏమరపాటుగా ఉండరాదని హెచ్చరించారు. మద్యం, డబ్బు, ఎన్నికలను ప్రభావితం చేసే, ప్రలోభాలకు గురిచేసే వస్తువుల రవాణాకు అవకాశం ఇవ్వకూడదని ఆదేశించారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. అదనపు డీజీపీ దయాల్ గంగ్వార్ వెంట డీఎస్పీలు బాలాజీ, రమేశ్‌కుమార్, పోలీసు అధికారులు ఉన్నారు.

## నేటితో ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి

■ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్



సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 15 : ప్రతిఒక్కరూ ఓటుహక్కు సద్వి నియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్ కోరారు. ఈ నెల 16లోగా ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, సెక్టోరల్ అధికారులు, బీఎల్వో సూపర్‌వైజర్లు, బీఎల్వోలు, నోడల్ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఓటరు స్లిప్పుల పంపిణీ, మదర్ రోల్ ప్రింటింగ్, మార్క్‌డ్ కాపీ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు స్లిప్పుల పంపిణీ చాలా ముఖ్యమైనదని, ప్రతి ఓటరుకు తప్పనిసరిగా ఓటరు స్లిప్పు అందించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా ముద్రించిన ఓటరు స్లిప్పుల పంపిణీ ఈ నెల 16లోగా 100 శాతం పూర్తికావాలని స్పష్టం చేశారు. బూత్ లెవెల్ అధికారి, బీఎల్వో సూపర్ వైజర్, సెక్టోరల్ అధికారి సమన్వయంతో ఓటు స్లిప్పుల పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని, పోలింగ్ రోజు కచ్చితంగా ఓటు వేసేలా చైతన్యపర్చాలన్నారు. అపుడే 100 శాతం పోలింగ్ జరుగుతుందన్నారు. ఓటరు స్లిప్పుల పంపిణీలో ఎవరూ నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు. టెలీకాన్ఫరెన్స్‌లో డీఆర్వో నగేశ్, రిటర్నింగ్ అధికారులు, ఏఆర్వోలు, సెక్టోరల్ అధికారులు, నోడల్ అధికారులు, బీఎల్వో సూపర్‌వైజర్లు, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

## కళాకారులపై సస్పెన్షన్ వేటు

■ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారని ఆరోపణలు
■ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 15 : తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా కళాకారులు ముగ్గురిని సస్పెండ్ చేస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టీఎస్ఎస్ కళాకారులు ఎన్.స్వప్న, యూ.భవాని, ఎస్.మల్లేశ్‌పై సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల నాటినుంచి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వస్తుందని, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున టీఎస్ఎస్ కళాకారులు ఎలాంటి రాజకీయ ప్రచార కార్యక్రమాలు, ఊరేగింపులు, వేదికల్లో పాల్గొనకూడదని ఆదేశాలున్నాయని తెలిపారు. ఏ రాజకీయ పార్టీకి ప్రచారం చేయరాదని తెలంగాణ సాంస్కృతిక సారథి సభ్య కార్యదర్శి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, సదరు ఆదేశాలు, ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించి రాజకీయ పార్టీల తరపున ప్రచారం చేస్తూ పాటలు పాడుతున్నట్లు రుజువైనందున టీఎస్ఎస్ కళాకారులు స్వప్న, భవాని, మల్లేశ్‌ను తక్షణమే విధుల నుంచి సస్పెన్షన్ చేసినట్టు కలెక్టర్ శరత్ పేర్కొన్నారు.



సదాశివపేట : బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్‌కు స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ శ్రేణులు




సదాశివపేట : 4వ వార్డులో చింతా ప్రభాకర్‌ను గజమాలలతో సత్కరించిన బీఆర్ఎస్ శ్రేణులు

# కారు గుర్తు.. భవితకు భరోసా

బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్



- సదాశివపేట గులాబీమయం
- బీఆర్ఎస్ శ్రేణుల తీన్మార్ జోష్
- 'పేట'ను మరింత అభివృద్ధి చేస్తా
- ఓడిపోయినా ప్రజల్లోనే ఉన్నా..
- ఊరూరా ప్రభాకరన్నకు ఘన స్వాగతం



సదాశివపేట : మహిళ ను ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్

సదాశివపేట, నవంబర్ 15 : సదాశివపేట పట్టణ ప్రజలు బీఆర్ఎస్‌కు నీరాజనం పట్టారు. బుధవారం పట్టణంలోని 4, 3, 2, 15, 16 వార్డుల్లో చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్, బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, మహిళలు తీన్మార్ స్టెప్పులు వేశారు. వీధుల్లో ప్రచారరథంపై పూలవర్షం కురించారు. మేమంతా మీ వెంటే ఉంటామని చింతా ప్రభాకర్‌కు అడుగడుగునా ప్రజలు నీరాజనం పలికారు. 4వ వార్డులో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గజమాల వేసి సత్కరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ మాట్లాడుతూ.. 60 ఏండ్లు కాంగ్రెస్ చేయని అభివృద్ధిని, సీఎం కేసీఆర్ పదేండ్లలో చేసి చూపించారన్నారు. ఎన్నికల్లో తాను ఓడినా నిత్యం ప్రజల్లోని ఉన్నానన్నారు. మీరే నా బలం, బలగం అని.. మీవెంటే తాను ఉంటానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండని జగ్గారెడ్డికి గుణపాఠం చెప్పాలన్నారు. సదాశివపేట పట్టణం మరింత అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని, తనను ఆశీర్వదిస్తే సేవకుడిగా పని చేస్తానన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాలను ఆదుకుంటుందని, అభివృద్ధిని చూసి కారుగుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని, కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ చింతా గోపాల్, కౌన్సిలర్లు పిల్లోడి విశ్వనాథం, నజీరోద్దీన్, ప్రకాశ్, ఖుద్దుస్, పిల్లోడి విశ్వనాథం, ఆకుల శివకుమార్, ఇంద్రమోహన్‌గౌడ్, కో ఆప్షన్ సభ్యుడు కోడూరి అంజన్న, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు మల్లన్న, ప్రధాన కార్యదర్శి వీరేశం, బీఆర్ఎస్వై మండలాధ్యక్షుడు బిట్ల ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.



సదాశివపేట : మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్



సదాశివపేట : తీన్మార్ స్టెప్పులు వేస్తున్న మహిళలు

## ప్రజానాయకుడు ప్రభాకరన్న

■ నేడు ఎమ్మెల్యే సతీమణి అరుణ ఎన్నికల ప్రచారం
■ కొండాపూర్ మండల ఎన్నికల ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి

కొండాపూర్, నవంబర్ 15 : పిలిస్తే పలికే నాయకుడు చింతా ప్రభాకర్ అని, బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం కొండాపూర్ మండలంలోని మల్కాపూర్‌లో ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందజేశారని, ప్రజలంతా బీఆర్ఎస్‌వైపే ఉన్నారన్నారు. చింతా ప్రభాకర్ గెలుపు ఎప్పుడో ఖాయమైనదని, మెజార్టీ కోసమే కార్యకర్తలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తి చింతా ప్రభాకర్ అన్నారు. ఓడిపోయినా ప్రజలకు అందుబాటులో ఉన్నారని గుర్తు చేశారు. జగ్గారెడ్డి ఐదేండ్లు ప్రజలను పట్టించుకోలేదని.. ఏ సమస్యనూ పరిష్కరించలేదని విమర్శించారు. చింతా ప్రభాకర్ కొండాపూర్ మండలంలో నేటినుంచి ప్రచారం నిర్వహిస్తారన్నారు. సంగారెడ్డి ఎన్నికల ఇన్‌చార్జి ఎర్రోళ్ల శ్రీనివాస్ సూచనలతో ప్రతి కార్యకర్త ఎంతగానో కష్టపడుతున్నారన్నారు. కొండాపూర్ మండలంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండని వ్యక్తికి ఓటేసినా ప్రయోజనం ఉండనప్పుడు ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు. సంగారెడ్డిలో బీఆర్ఎస్ విజయం ఖాయమన్నారు. సమావేశంలో వైస్‌ఎంపీపీ లక్ష్మీరామచందర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మ్యాకం విఠల్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ రామకృష్ణ గ్రూప్ (TS No. 1) Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులకు/పేషెంట్ల సేవకు, వంట/ఇంటి పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. తెలంగాణ అంతటా వర్కర్లను మీ ఇంటికి పంపగలము. Ph: 9618802390, 9912611122.
NT-314452

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.